# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22న ప్రారంభం కానున్నాయి.
- రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపధ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ఉత్తరాంధ్ర ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి సింహాచలం గిరి ప్రదక్షిణ రేపు జరగనుంది.
- మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీసులో సాంకేతిక లోపం కారణంగా విమానయాన సేవలు ఆలస్యం అవుతున్నాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపధ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపధ్యంలో ముందస్తు ప్రణాళికతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై ముఖ్యమంత్రి ఈరోజు దృశ్యమాధ్యమం ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ, సమర్ధవంతంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీసులో అంతరాయంతో దేశవ్యాప్తంగా విమాన సేవల్లో జాప్యం జరుగుతున్నదని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీస్‌తో నడిచే కంప్యూటర్లు, లాప్‌టాప్‌లలోని సాంకేతిక లోపంతో పలు విమాన సేవలు నిలిచిపోయాయి. ఈ నేపధ్యంలో కేంద్ర మంత్రి ప్రయాణీకులకు అసౌకర్యం కలగకుండా విమానాశ్రయాల్లో అదనపు సీట్లు, మంచినీటి వసతి, ఆహారం సమకూర్చాలని విమానాశ్రయ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మ్యాన్యువల్ బ్యాకప్ సిస్టమ్స్ ద్వారా పరిస్థితిని కొంతమేర చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. మైక్రో సాఫ్ట్ క్రష్ ప్రభావంతో గన్నవరం విమానాశ్రయం నుండి పలు విమాన సర్వీసులు ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఏ.కే.లక్ష్మీ కాంత్ రెడ్డి వెల్లడించారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ లో బుకింగ్ చేసుకుని వస్తున్న విమానయాన ప్రయాణికులకు, మాన్యువల్ గా బోర్డింగ్ పాసులు ఇస్తున్నట్టు తెలిపారు. విమానాశ్రయం కౌంటర్లో ప్రయాణికులకు టికెట్లు నిలిపివేసినట్టు ఆయన వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ ప్రకటన జారీ చేశారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయసభల సమావేశాలు మొదలుకానున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ తో పాటు రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు రాష్ట్ర ఉభయ సభల సమావేశాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయి బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తీసుకోనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

నెల్లూరు జిల్లా స్వర్ణాల చెరువు వద్ద జరిగే రొట్టెల పండుగను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ నేపధ్యంలో ముఖ్యమంత్రి పండుగకు హాజరైన భక్తులతో దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. సర్వమత సమ్మేళనానికి ఇది ప్రతీక అని, గతంలో రాష్ట్ర పండుగగా దీనిని ప్రకటించామన్నారు. బారా షాహీ దర్గా అభివృద్ధికి 5 కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ప్రార్ధనలు చేయాలని చంద్రబాబు నాయుడు భక్తులను ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రైతాంగం గత నెల రోజులుగా సాగు చేస్తున్న పంట పొలాలు భారీ వర్షాలు కారణంగా నీట మునిగాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లోని ముంపునకు గురైన ప్రాంతాలు, పంట పొలాలను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని అన్నారు. నిడదవోలు మండలంలో సుమారు 13 వేల ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ముంపుకు గురైన పంట పొలాలపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడామని, నష్టాలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఏటిగట్టు పటిష్టంగా ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళికతో చర్యలు చేపట్టడుతున్నామని మంత్రి తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ అల్ప పీడనం రేపు తెల్లవారుజామున వాయువ్య దిశగా పయనించి, ఒడిసాలోని పూరీ వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తర్వాత ఈ అల్పపీడనం ఒడిసా, ఛత్తీస్

ఘుడ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలి, తదుపరి 24 గంటలలో క్రమగా బలహీన పడుతుందని వాతావరణ అధికారి వివరిస్తూ...

(వాయిస్ 47 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి సింహాచలం గిరి ప్రదక్షిణ రేపు జరగనుంది. ఏడాదికి ఒకసారి వచ్చే ఈ గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టినట్లు విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. భక్తులు నడిచే గిరి ప్రదక్షిణ మార్గాన్ని ఆమె ఈరోజు జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరి మార్గంలో పారిశుద్ధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నడక మార్గంలో ఎప్పటికప్పుడు పరిశుభ్రతా విధులు చేపట్టేందుకు 24 గంటలు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ వెల్లడించారు.

మరోవైపు సింహాచలం గిరి ప్రదక్షిణ పురస్కరించుకొని విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో రవాణా శాఖ ట్రాఫిక్ ఆంక్షలను జారీ చేసింది. అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లేవాహనదారులకు విశాఖపట్నం సిటీ గుండా వెళ్లేందుకు అనుమతిలేదని, ప్రత్యామ్నాయంగా లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం గుండా ప్రయాణించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాజమహేంద్రవరం వద్ద గోదావరి నది ఉద్ధృతి పెరిగింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ కి వచ్చి చేరుతున్న వరద నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, రాజానగరం, అనపర్తి, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో వర్షం కురుస్తోంది. దీంతో వేల ఎకరాల్లోని పొలాలు నీటమునిగాయి. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బూరుగులంక వద్ద గోదావరిలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దేవీపట్నం మండలం గండిపోచమ్మ ఆలయాన్ని వరద ముంచెత్తింది. దీంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. విలీన మండలాల్లోనూ వాగులు పొంగుతున్నాయి. వర రామచంద్రాపురం మండలంలో అన్నవరం వాగు పొంగుతోంది. దీంతో చింతూరు – వర రామచంద్రాపురం మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చింతూరు వద్ద శబరి నది వరద పెరుగుతోంది. కోనసీమలోని రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే అల్లూరి జిల్లాలో భారీ వర్షాలకు కొండ వాగులు పొంగుతున్నాయి. పాడేరు మండలం రాయగడ్డ, పరదానిపుట్టు వద్ద మత్స్యగెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. జి.మాడుగుల మండలం కుంబిడిసింగి బ్రిడ్జిపై వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెదబయలు మండలం గిన్నెలకోట, జామిగూడలో గెడ్డలు పొంగుతున్నాయి. అలాగే ముంచంగిపుట్టు మండలం బిరిగూడ గెడ్డ పొంగి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =